జాతీయ స్థాయి త్రోబాల్‌ పోటీలకు విద్యార్థుల ఎంపిక


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్‌

బండ్లగూడ: విద్యార్థులు తమ లక్ష్యసాధన కోసం కష్టపడాలని రాక్‌ హై స్కూల్‌ ప్రిన్సిపాల్‌ మేరీ జోయిస్‌ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని రాక్‌ హై స్కూల్‌ విద్యార్థులు జాతీయ స్థాయి జూనియర్‌ త్రోబాల్‌ పోటీలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... నవంబర్‌ 30వ తేదీన నారాయణమ్మ కాలేజీలో జరిగిన రాష్ట్ర స్థాయి త్రోబాల్‌ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు పీటగర్‌, గణేష్‌, ప్రశాంత్‌, అశ్వితలు జూనియర్‌ త్రోబాల్‌ పోటీల్లో పాల్గొన్నారన్నారు. ఇందులో ప్రతిభకనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి 11వ తేదీ వరకు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పీఈటీ శ్రీనివాస్‌, రాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రహరీ నిర్మాణ పనులను అడ్డుకున్న దళితులు


ప్రహరీ నిర్మాణ పనులను అడ్డుకుంటున్న దృశ్యం

మణికొండ: అనాదిగా దళితులు సాగు చేసుకున్న భూమిని హౌసింగ్‌ బోర్డుకు కేటాయించారని ప్రహరీ నిర్మాణ పనులను కొనసాగించేందుకు వచ్చిన అధికారులను వారు అడ్డుకున్నారు. గండిపేట మండలం, వట్టినాగులపల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్‌ 132లోని 56 ఎకరాలను గతంలో కాంగ్రెస్‌ ప్రభుత్వం హౌసింగ్‌ బోర్డుకు కేటాయించింది. దశాబ్ద కాలానికి పైగా అందులో ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించలేదు. అందులో అనాదిగా గ్రామానికి చెందిన దళితులు సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. ఇటీవల హౌసింగ్‌ బోర్డు అధికారులు సదరు భూమిని స్వాధీనం చేసుకునే క్రమంలో అందులో వచ్చిన అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. సోమవారం సదరు భూమి చుట్టూ ప్రహరీ నిర్మాణ పనులను ప్రారంభించారు. విషయం తెలుసుకుని అక్కడకు చేరుకున్న దళితులు తమ భూమిని ఎట్టి పరిస్థితిలో తీసుకోనివ్వమని పనులను అడ్డుకున్నారు. దాంతో చేసేది లేక అధికారులు పనులను నిలిపివేశారు.

రైతులకు అండగా ఉంటాం: ప్రదీప్‌కుమార్‌

వట్టినాగులపల్లి గ్రామానికి చెందిన దళితుల భూమిని హౌసింగ్‌ బోర్డు వారు తీసుకోవటం మంచి పద్ధతి కాదని, తామంతా వారికి అండగా ఉంటామని కాంగ్రెస్‌ పార్టీ నార్సింగి మున్సిపల్‌ ప్రధాన కార్యదర్శి మైలారం ప్రదీప్‌కుమార్‌ అన్నారు. ఈ విషయాన్ని త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తామన్నారు.

అవినీతి అధికారులకు కఠిన శిక్షలు విధించాలి


అల్ల రామకృష్ణ

గన్‌ఫౌండ్రీ: తెలంగాణలోని అవినీతి అధికారులపై అవినీతి నిరోధక శాఖ ఉక్కుపాదం మోపుతూ..వరస దాడులు, అరెస్టులతో అవినీతి అధికారులు గుండెల్లో వణుకు పుట్టిస్తుందని ఓబీసీ హక్కుల పరిరక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు అల్ల రామకృష్ణ అన్నారు. ఈ మేరకు సోమవారం సైఫాబాద్‌లోని పరిరక్షణ సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ పాలనలో అవినీతి ఏరులై పారిందని మండిపడ్డారు. మిగులు బడ్జెట్‌తో ఉన్న రాష్ట్రాన్ని మాజీ సీఎం కేసీఆర్‌ గారు తెలంగాణ పేరుతో అప్పుల తెలంగాణగా మార్చారని ధ్వజమెత్తారు. నీటి పారుదల శాఖ అసిస్టెంట్‌ ఎగ్జిక్యూటీవ్‌ ఇంజినీర్‌ నిఖిలేష్‌, హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్‌ శివబాలకృష్ణ వంటి పలువురు అధికారులపై ఏసీబీ నిర్వహించిన దాడులలో రూ.100 కోట్ల అక్రమ సంపాదన బయటపడిందని గుర్తు చేశారు. తెలంగాణలో కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి ఏసీబీకి పూర్తి స్వేచ్ఛను ఇచ్చారని, దీంతో రోజుకు పదులు సంఖ్యలో అవినీతి అధికారులపై కేసులు నమోదు అవుతున్నాయని పేర్కొన్నారు.

చిరువ్యాపారులను ఆదుకోవాలి


బల్దియా డిప్యూటీ కమిషనర్‌తో ఎమ్మెల్యే కౌసర్‌

గోల్కొండ: చిరువ్యాపారులను ఆదుకోవాలని ఎమ్మెల్యే కౌసర్‌ మోహియుద్దీన్‌ అన్నారు. సోమవారం బల్దియా డిప్యూటీ కమిషనర్‌ శశిరేఖ, యూసీడీ అధికారి లలితకుమారితో ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా వివిధ పొదుపు సంఘాల గ్రూప్‌ లీడర్లకు, తోపుడు బండ్లు, చిరువ్యాపారులకు అవగాహన కల్పించేందుకు వారికి మంజూరైన చెక్కులను ఇచ్చేందుకు ప్రణాళిక సిద్ధం చేశామని ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్‌ ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తోపుడు బండ్ల వ్యాపారులకు రెక్కాడితేగానీ డొక్కాడని అటువంటి వారికి బ్యాంకులు గానీ వేరు ఇతర ఆర్థిక సంస్థలు రుణాలు ఇవ్వవని ఆయన అన్నారు. బల్దియా యూసీడీ విభాగం అధికారులు ఇటువంటి వారిని గుర్తించి వారికి అండగా నిలవాలని ఆయన అన్నారు. అంతేకాకుండా పొదుపు సంఘాల ఏర్పాటుకు ప్రతి డివిజన్‌లో యూసీడీ విభాగం సిబ్బంది పర్యటించి మహిళలను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూసీడీ అధికారిణి లలితకుమారి తదితరులున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


ప్రజావాణిలో జోనల్‌ కమిషనర్‌ వెంకన్న

చార్మినార్‌: ప్రజావాణిలో తమకు అందిన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్‌ఎంసీ చార్మినార్‌ జోనల్‌ కమిషనర్‌ టీ. వెంకన్న తెలిపారు. సోమవారం జోనల్‌ కమిషనర్‌ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం జరిగింది. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. ఈ సందర్భంగా జోనల్‌ కమిషనర్‌ వెంకన్న మాట్లాడుతూ..ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం చెప్పట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్‌ ఎస్‌ఈ మహేశ్వర్‌రెడ్డి, యూబీడీ డిప్యూటీ డైరెక్టర్‌ అమీనా బి, వెటిర్నరీ డిప్యూటీ డైరెక్టర్‌ డాక్టర్‌ శ్రీనివాస్‌ రెడ్డి, టౌన్‌ ప్లానింగ్‌ సీపీ మహమ్మద్‌ అబ్దుల్‌ మజీద్‌, ఏఎంసీ రాజారావు, ఎలక్ట్రికల్‌ ఈఈ రామారావు, బిల్‌ కలెక్టర్‌ రాజేష్‌ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్‌ కావ్య ప్రియకు సర్వీస్‌ ఎక్సలెన్సీ అవార్డు-2024



కావ్య ప్రియకు అవార్డు అందజేస్తున్న గవర్నర్‌ జిష్ణుదేవ్‌ వర్మ

యాకుత్‌పురా: వైద్య రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న నగరానికి చెందిన ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్‌ కావ్య ప్రియ వజ్రాలకు సర్వీస్‌ ఎక్సలెన్సీ అవార్డు-2024 లభించింది. ఇండియన్‌ మెడికల్‌ అసోసియేషన్‌ బంజారాహిల్స్‌ బ్రాంచ్‌ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి నగరంలో నిర్వహించిన 4వ వార్షిక ఐఎంఏ ఇంఫాక్ట్‌ కన్‌-2024 అవార్డు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన గవర్నర్‌ జిష్ణు దేవ్‌వర్మ డాక్టర్‌ కావ్య ప్రియకు అవార్డును అందజేశారు. హైరిస్క్‌ ప్రెగ్నెన్సీ విభాగంలో గర్భిణులకు అందిస్తున్న అత్యుత్తమ వైద్య సేవలకు గాను ఆమెకు అవార్డు అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. తన సేవలను గుర్తించి అవార్డు అందజేసిన గవర్నర్‌తో పాటు ఐఎంఏ బ్రాంచ్‌ వ్యవస్థపక అధ్యక్షుడు డాక్టర్‌ చల్లగలి ప్రభు కుమార్‌కు ఆమె ధన్యవాదాలు తెలియజేశారు.

కాంగ్రెస్‌ పాలనలో అందరికీ న్యాయం


టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌తో కురాకుల కృష్ణ తదితరులు

గోల్కొండ: కాంగ్రెస్‌ పాలనలో అందరికీ న్యాయం జరుగుతుందని టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్‌ అన్నారు. సోమవారం కార్వాన్‌ నియోజకవర్గం సీనియర్‌ నాయకులు, తెలంగాణ రాష్ట్ర ఎరుకల సంఘం నాయకుడు కురాకుల కృష్ణ ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఎరుకల సోదరులకు నామినేటెడ్‌ పోస్టుల్లో ప్రాధాన్యం ఇవ్వాలని ఆయనకు విజ్ఞప్తి చేశారు. దీనిపై టీపీసీసీ అధ్యక్షుడు మాట్లాడుతూ..ఎరుకల ఫైనాన్స్‌ కార్పొరేషన్‌ను మరింత బలోపేతం చేసి దానికి ప్రత్యేకంగా కమిటీ వేస్తామన్నారు.

పీరంచెరువు పార్కు..
పర్యవేక్షణ కరువు

పచ్చదనం లేక కళతప్పిన పార్కు


పార్కులో ఎండిపోతున్న మొక్కలు

- కొరవడుతున్న ఆహ్లాదం
- పట్టించుకోని అధికార యంత్రాంగం

బండ్లగూడ: వాతావరణ పరిస్థితులు, కాలుష్య పరిసరాలతో వేగలేకపోతున్న ప్రజలకు కాస్తయినా ఉపశమనానికి చిన్నదో పెద్దదో పీరంచెరువు పార్కు ఉంది. ఉదయం వాకింగ్‌ చేసేవారికి, సాయంత్రం పిల్లలతో సరదాగా పార్కులో గడపాలనుకునే వారికి ఈ పార్కు ఉండేది. ఇప్పుడు నిర్వహణ లోపంతో పార్కులో పచ్చదనం కరువైంది.

◆ బండ్లగూడ జాగీర్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని పీరంచెరువు పార్కుపై పర్యవేక్షణ కొరవడింది. కార్పొరేషన్‌ ప్రజలకు పచ్చని చెట్లతో పాటు ఆహ్లాదకర వాతావరణాన్ని అందించేందుకు పీరంచెరువు పార్కును 2020 సంవత్సరంలో హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో నిర్మించారు. 2400 మొక్కలతో పార్కును ప్రారంభించింది. పార్కును ఏర్పాటు చేసిన నాలుగేళ్లకే సందర్శకులు లేక మూగబోయింది. తొలినాళ్లలో వందలాది మంది సందర్శకులతో కిటకిటలాడిన పీరంచెరువు పార్కు ప్రస్తుతం నిరాదరణకు గురవుతోంది. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి నిర్మించిన పార్కు కళ తప్పుతోంది.

కొరవడిన పచ్చదనం..

ఎటుచూసినా పచ్చని చెట్లు.. చూడగానే కాసేపు సేదతీరాలనిపించేలా ఉండవలసిన పార్కు నిర్వాహణ లోపం, విధుల్లో బాధ్యతారాహిత్యం కారణంగా వాటిల్లో పచ్చదనం కరువైనప్పటికీ అధికారుల్లో స్పందన లేకపోవడంతో కార్పొరేషన్‌ వాసులకు చికాకు పెడుతున్నది. గతంలో కార్పొరేషన్‌ ప్రజలకు ఆహ్లాదం, ఆనందాన్ని పంచిన పార్కులో ఇప్పుడు పచ్చదనం లేకుండా పోతుందని స్థానికులు వాపోతున్నారు.

రియల్‌ ఎస్టేట్‌ సంస్థ ఆధ్వర్యంలో..

ఓ రియల్‌ ఎస్టేట్‌ వ్యాపార సంస్థ పీరంచెరువు సమీపంలో భారీ నిర్మాణాలు చేపడుతుంది. చెరువు సుందరీకరణకు హెచ్‌ఎండీఏ నుంచి ప్రతిపాదనలు పొందింది. ఈ పనులు అప్పగించడంపై గతంలో విమర్శలు వెలువెత్తాయి. తమ ప్రాజెక్టుల కోసం చెరువుల సుందరీకరణ పేరుతో అక్రమాలు, ఆక్రమణలకు పాల్పడినట్లు ఆరోపణలున్నాయి.

◆ రెండేళ్ల క్రితం చెరువు చుట్టు భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. వాటిపై చెరువు చుట్టు పచ్చదనం, వాకింగ్‌ ట్రాక్‌, స్ట్రీట్‌ లైటింగ్‌, ఫర్నిచర్‌, పిల్లలకు ఆట పరికరాలను అమర్చడం వంటివి చేస్తామని వాటిపై ఉంది. అయితే ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి మాత్రం చేయలేదు. భారీ ఫ్లెక్సీలు కూడా ప్రస్తుతం పాడైపోయాయి.

పూర్వవైభవం సంతరించుకునేలా..

పార్కులో నాలుగేళ్ల నుంచి కనిపించిన పచ్చదనం మనసుకు ఎంతో ఆహ్లాదం, ఆనందాన్ని అందించిన పీరంచెరువు పార్కు ఇప్పుడు అక్కడ కళాకాంతులను కోల్పోతున్నది. చల్లటి గాలులతో అటూ ఇటూ ఊగే పచ్చని చెట్లతో ఎంతో హాయిగా ఉండేది. రకరకాల పక్షులు కూడా ఇక్కడి పార్కులో నివాసముంటాయి. ఈ పార్కుకు పూర్వవైభవం వచ్చేలా సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


పీరంచెరువులో పక్షులు

నేడు ఉచిత వైద్య శిబిరం

రాజేంద్రనగర్‌: ప్రజా పాలన ప్రజా విజయోత్సవాల సందర్భంగా రాజేంద్రనగర్‌ సర్కిల్‌ కార్యాలయంలో మంగళవారం వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు అధికారులు వెల్లడించారు. ఉదయం సర్కిల్‌ కార్యాలయం ఆవరణలో ఈ హెల్త్‌ క్యాంపును ఏర్పాటు చేశామన్నారు. నిపుణులైన డాక్టర్ల బృందాలు కార్మికులకు వైద్య సేవలను అందజేస్తారన్నారు. వైద్య శిబిరంలో ఉచితంగా వైద్య సేవలతో పాటు మందులను అందజేస్తారన్నారు.

చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



రాయదుర్గం: జీపీ ఆర్‌ఏ క్వార్టర్స్‌లోని రాజరాజేశ్వరి సమేత చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి నూతన వస్త్రాలు, పూలతో అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే ఆలయంలోని షిర్డీ సాయిబాబా, రాజరాజేశ్వరి మాత, గణపతి, ఆంజేయస్వామి, పెద్దమ్మ, మైసమ్మ అమ్మవార్లకూ ప్రత్యేక పూజ లు, అభిషేకాలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చార్మినార్‌: 2024-25 సంవత్సరానికి గాను ప్రభుత్వ సిటీ కళాశాల (అటానమస్‌)లో స్టాటిస్టిక్స్‌ విభాగంలో తాత్కాలిక అతిథి అధ్యాపక నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపాల్‌ ఆచార్య పి.బాల భాస్కర్‌ ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తు, అర్హతల ఒరిజినల్స్‌, ధ్రువీకరణ పత్రాలతో డిసెంబర్‌ 4వ తేదీ సంబంధిత శాఖలో ఇంటర్వ్యూకి హాజరుకావాలని ఆయన కోరారు. పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులు సాధించిన వారు అర్హులని, పీహెచ్‌డీ, ఎం.ఫిల్‌, నెట్‌, స్లెట్‌ వంటి అదనపు అర్హతలతో పాటు బోధనానుభావం కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. వివరాలకు డి.శ్రవణ్‌ కుమార్‌ (98482 74530)ను సంప్రదించాలన్నారు.

చార్మినార్‌ ఇన్‌చార్జిపై చర్యలు తీసుకోవాలి

చార్మినార్‌: ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన దీక్ష దివస్‌ కార్యక్రమంలో చార్మినార్‌ నియోజకవర్గం బీఆర్‌ఎస్‌ పార్టీ ఇన్‌చార్జి మహ్మద్‌ సలావుద్దీన్‌ లోదీ పాల్గొనకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారని..అతనిపై పార్టీ అధిష్టానం క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని పాతబస్తీ బీఆర్‌ఎస్‌ పార్టీ నాయకులు డిమాండ్‌ చేశారు. సోమవారం విలేకరులతో మొఘల్‌పురా డివిజన్‌ బీఆర్‌ఎస్‌ అధ్యక్షుడు పుప్పాల రాధాకృష్ణ, మణికొండ విజయ్‌ కుమార్‌, తిరుపతి నాగరాజ్‌, మహమ్మద్‌ అమీర్‌, పంకజ్‌ షిండే తదితరులు పాల్గొని నియోజకవర్గ ఇన్‌చార్జికి వ్యతిరేకంగా తీర్మానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చార్మినార్‌ నియోజకవర్గం నుంచి సలావుద్దీన్‌ లోదీ ఆధ్వర్యంలో ఎలాంటి ర్యాలీ కానీ..కార్యకర్తల తరలింపు గానీ చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు.

డ్రగ్స్‌ రహిత సమాజమే లక్ష్యం



ర్యాలీలో పాల్గొన్న ఫీవర్‌ ఆస్పత్రి సూపరింటెండెంట్‌

మైలార్‌దేవ్‌పల్లి: మహవీర్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ సైన్స్‌ అండ్‌ టెక్నాలజీ బండ్లగూడ ఎన్‌ఎస్‌ఎస్‌ విద్యార్థిని విద్యార్థులు సమాజ సేవలో భాగంగా డ్రగ్స్‌ రహిత సమాజం కోసం అవగాహన ర్యాలీ నిర్వహించారు. సోమవారం గవర్నమెంట్‌ ఫీవర్‌ ఆస్పత్రి నుంచి విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. రింకీ మినిస్ట్రీ సొసైటీ సౌజన్యంతో ఆస్పత్రిలో విద్యార్థులు రక్త దానం చేశారు. అనంతరం ఫీవర్‌ ఆస్పత్రి సూపరింటెండెంట్‌ డాక్టర్‌ రాజేంద్రప్రసాద్‌ మాట్లాడుతూ... విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటు పడకుండా ఉండాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల విద్యాభ్యాసం కోసం ఆస్తులు అమ్మి చదివించేవారు ఉన్నారని వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలని కోరారు. చెడు వ్యసనాలను దూరంగా ఉండాలన్నారు. ఆస్పత్రి ఆర్‌ఎంవో జయలక్ష్మి, సొసైటీ ఫౌండర్‌ బాల్‌రాజ్‌, ఎన్‌ఎస్‌ఎస్‌ కోఆర్డినేటర్‌ వీరేంద్ర పాటిల్‌ పాల్గొన్నారు.

‘ప్రజావాణి’ ఫిర్యాదులపై పటిష్ట చర్యలు

రాజేంద్రనగర్‌: ప్రజావాణి కార్యక్రమంలో అందిన ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందిస్తూ సత్వర పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటున్నట్టు జీహెచ్‌ఎంసీ రాజేంద్రనగర్‌ సర్కిల్‌ జీహెచ్‌ఎంసీ ఉప కమిషనర్‌ రవికుమార్‌ వెల్లడించారు. సోమవారం సర్కిల్‌ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజావాణి కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీలోని అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొంటున్నారని తెలిపారు. ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత అధికారులకు ఫిర్యాదును అందజేసి స్వయంగా ఫీల్డ్‌ వర్క్‌ నిర్వహించి సమస్య పరిష్కారం కోసం కృషి చేయాలని ఆదేశించినట్లు వెల్లడించారు. రాజేంద్రనగర్‌ సర్కిల్‌ పరిధిలోని అత్తాపూర్‌, మైలార్‌దేవ్‌పల్లి, సులేమాన్‌ నగర్‌, శాస్త్రిపురం, రాజేంద్రనగర్‌ డివిజన్‌ ప్రజలు ఈ ప్రజావాణి కార్యక్రమాన్ని ఉపయోగించుకొని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు.

కరాటేలో సత్తాచాటిన తెలంగాణ క్రీడాకారులు



మెడల్స్‌ సాధించిన క్రీడాకారులతో తెలంగాణ స్పోర్ట్స్‌ ప్రధాన కార్యదర్శి ఎం.కె.శ్రీబాలాజీ

జియాగూడ: న్యూ ఢిల్లీలోని గౌతమ్‌బుద్ధా యూనివర్సిటీలో 32వ ఏఐకేఎఫ్‌ నేషనల్‌ కరాటే డో చాంపియన్‌షిప్‌-2024 పోటీలకు గత నెల 28 నుంచి 30వ తేదీ వరకు జరిగాయి. ఈ పోటీల్లో తెలంగాణలోని పలు స్కూల్స్‌, కాలేజీలకు చెందిన 11 మంది క్రీడాకారులు 14 మెడల్స్‌ సిల్వర్‌, కాంస్య పతకాలను సాధించినట్లు కరాటే డో అసోసియేషన్‌ ఆఫ్‌ తెలంగాణ స్పోర్ట్స్‌ ప్రధాన కార్యదర్శి ఎం.కె.శ్రీబాలాజీ తెలిపారు. ఈ సందర్భంగా బాలాజీ మాట్లాడుతూ..కరాటేపై విద్యార్థులు ఎంతో ఆసక్తి చూపిస్తున్నారని, ఆత్మరక్షణకు ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. పోటీల్లో జియాగూడకు చెందిన విద్యాశ్రీ హై స్కూల్‌ విద్యార్థి సిద్ధార్థ్‌, రిలయన్స్‌ స్కూల్‌, విమల్‌ రాజ్‌ శ్రీ సాయి టాలెంట్‌ స్కూల్‌, రవిసాగర్‌ నాంపల్లి డైమండ్‌ జూబ్లీ స్కూల్‌ నేహ, యాషిక, తనిష, జీసీపీ కాలేజీ సుమిత్‌, ఉస్మానియా యూనివర్సిటీ నిఖిల్‌లు సాధించినట్లు తెలిపారు.

డ్రైనేజీలో పడి వ్యక్తి మృతి


మృతి చెందిన వెంకట్‌రాములు

మైలార్‌దేవ్‌పల్లి: మద్యం మత్తులో ప్రమాదవశాత్తు మురికి కాలువలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ నరేందర్‌ సమాచారం మేరకు... మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌ పరిధిలోని సాయిబాబనగర్‌లో నివసిస్తున్న వెంకట్‌రాములు(50) సెంట్రింగ్‌ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతని భార్య మృతి చెందడంతో మనస్థాపం చెంది నిత్యం మద్యం సేవించి ఉంటాడు. ఇతనికి ముగ్గురు సంతానం. ఆదివారం రాత్రి మద్యం సేవించి ఆరాంఘర్‌ అండర్‌ గ్రౌండ్‌ బ్రిడ్జి కింద ఓపెన్‌ నాలాపై కూర్చొని మద్యం మత్తులో ప్రమాదవశాత్తు జారి పడ్డాడు. ఉదయం స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటన స్థలికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకి తీసి పోస్ట్‌మార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు రుణాల పంపిణీ


రైతులకు చెక్కులను పంపిణీ చేస్తున్న చైర్మన్‌

శంషాబాద్‌ రూరల్‌: మండలంలోని చిన్న గోల్కొండ సొసైటీ పరిధిలోని రైతులకు సోమవారం రుణాలను పంపిణీ చేశారు. రూ. 18.01 లక్షలకు సంబంధించిన దీర్ఘ, స్వల్పకాలిక రుణాల చెక్కులను చైర్మన్‌ దొనాకర్‌గౌడ్‌ రైతులకు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ డైరక్టర్లు దేవేందర్‌రెడ్డి, మోహన్‌రావు, ప్రశాంత్‌రెడ్డి, బాల్యానాయక్‌, రూప, విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

హిమాచల్‌ పర్యటనకు 50 మంది విద్యార్థుల ఎంపిక

రాయదుర్గం: ‘ఏక్‌ భారత్‌ శ్రేష్ఠ భారత్‌’ యువ సంఘం ఆధ్వర్యంలో హిమాచల్‌ప్రదేశ్‌ పర్యటనకు 50 మంది విద్యార్థులు ఎంపికైనట్లు నోడల్‌ అధికారి ప్రొఫెసర్‌ మహ్మద్‌ ఫరియాద్‌ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 22 నుంచి 29 వరకు వీరు హిమాచల్‌ప్రదేశ్‌లోని హమీర్‌పూర్‌లోని ఎన్‌ఐటీని సందర్శిస్తారని పేర్కొన్నారు. రాష్ట్రంలో ‘ఏక్‌భారత్‌ శ్రేష్ఠ భారత్‌’ కార్యక్రమాలను నిర్వహించేందుకు మౌలానా ఆజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం నోడల్‌ విశ్వవిద్యాలయంగా నామినేట్‌ అయిందని తెలిపారు. అంతేగాకుండా అక్కడి ఎన్‌ఐటీతో విద్యా మంత్రిత్వ శాఖ ‘మనూ’ను జత చేసిందని పేర్కొన్నారు.

శ్మశానవాటికలో కుళ్లిపోయిన స్థితిలో వ్యక్తి మృతదేహం

మణికొండ: శ్మశానవాటికలో కుళ్లిపోయిన స్థితితో ఓ వ్యక్తి మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. నార్సింగి పోలీసుల సమాచారం మేరకు... పుప్పాలగూడ శ్మశాన వాటికలో ఓ వ్యక్తి మృతి చెంది ఉన్నట్టు అటువైపు వెళ్లిన మున్సిపల్‌ సిబ్బంది చూశారు. వారు శ్మశాన వాటిక ఇంచార్జికి విషయం తెలపటంతో ఇంచార్జి మాన్‌సింగ్‌ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడు ఎరుపు రంగు టీషర్ట్‌, నీలి రంగు ప్యాంటు ధరించి, ఒక చేతి మణికట్టు వరకు తెగిపడి ఉందని పోలీసులు తెలిపారు. మృతదేహం కుళ్లిపోయి ఉందని, అతని వయసు 30 నుంచి 40 మధ్య ఉండవచ్చన్నారు. అతని ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌ స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు కోరారు.

చలికి గుర్తుతెలియని వ్యక్తి మృతి



లంగర్‌హౌస్‌: చలి తీవ్రతకు తట్టుకోలేక గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన ఘటన లంగర్‌హౌస్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. సుమారు 38 ఏళ్ల వయస్సు గల వ్యక్తి తలకు గాయంతో కట్టు కట్టించుకొని ఆదివారం సాయంత్రం బాపూఘాట్‌ వద్ద తిరిగాడు. రాత్రి కురిసిన వర్షానికి అలాగే తడుస్తూ, చలికి తట్టుకోలేక పడిపోయాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది అక్కడకు చేరుకొని పరీక్షించగా అతను అప్పటికే మృతిచెందాడు. కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా మార్చూరీకి తరలించారు.

ప్రసన్న కిరణ్‌కు సత్కారం

అబిడ్స్‌: ప్రముఖ కవయిత్రి, రచయిత బీదా ప్రసన్న కిరణ్‌ను వే ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. సామాజిక, సాంఘిక రంగాలతో పాటు ప్రకృతి, మహిళా రంగాలపై విశేషంగా ఆకట్టుకునే విధంగా తమ కవితలను భావ వ్యక్తీకరణతో రచనలు చేస్తున్న ఆమెను ప్రముఖ విద్యావేత్త సూరేపల్లి రవికుమార్‌, సంఘ సేవకుడు అమృత్‌కుమార్‌ జైన్‌ ఘనంగా సత్కరించి ప్రశంసించారు. ఈ సందర్భంగా ప్రసన్న కిరణ్‌ మాట్లాడుతూ..చక్కని భావ వ్యక్తీకరణతో సమాజంలో అందరికీ ఉపయోగ పడేవిధంగా విలువైన రచనలు, కవితలు చేసేందుకు నిరంతరం కృషి చేస్తానన్నారు.

విజయోత్సవాలకు భారీ ఏర్పాట్లు

చార్మినార్‌: ఏడాది పాలన విజయోత్సవాలను విజయవంతం చేయడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నామని చార్మినార్‌ శాసనసభ నియోజకవర్గం కాంగ్రెస్‌ పార్టీ మాజీ ఇన్‌చార్జ్‌ వెంకటేష్‌ మేరు అన్నారు. తమ ప్రభుత్వం ఏడాది కాలంలోనే రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు. కుల మతాలకతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. సీఎం రేవంత్‌ రెడ్డి ఆధ్వర్యంలోని ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి కోసం పనిచేస్తుందన్నారు. ఇది గిట్టని బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌ పార్టీలు అడ్డదిడ్డమైన ఆరోపణలు చేస్తూ దుష్ప్రచారానికి పాల్పడటం సరైనది కాదన్నారు.

జిమ్రిస్‌ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ

అఫ్జల్‌గంజ్‌: జిమ్రిస్‌ గ్రూప్‌ ఆధ్వర్యంలో విద్యార్థులకు పలు కోర్సులలో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎంప్లాయిమెంట్‌ ఉద్యోగ అవకాశాలతో పాటు నిరుద్యోగులకు కూడా ఉపయోగపడే విధంగా శిక్షణ ఇస్తున్నామన్నారు. ఆటోక్యాడ్‌, ఎంఎస్‌ ఆఫీస్‌, పవర్‌పాయింట్‌, ఎక్సెల్‌, ఫొటోషాప్‌, అకౌంటింగ్‌, ఇంటెజ్‌, స్పోకెన్‌ ఇంగ్లిష్‌, ఫ్రంట్‌ ఆఫీస్‌ సెక్రెటరీ, ఇతర పలు కోర్సుల్లో శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేస్తామన్నారు. వివరాలకు 92916 82731, 86866 28372లలో సంప్రదించాలన్నారు.

సన్మానం

యాకుత్‌పురా: విధి నిర్వహణలో మోయిజ్‌ అందించిన సేవలు అభినందనీయమని ప్రభుత్వరంగా సెట్విన్‌ శిక్షణ సంస్థ చైర్మన్‌ గిరిధర్‌ రెడ్డి అన్నారు. పురానీహవేలీలోని సెట్విన్‌ ప్రధాన కార్యాలయంలో జనరల్‌ మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న మహ్మద్‌ అబ్దుల్‌ మోయిజ్‌ పదవీ విరమణ సందర్భంగా సోమవారం నిర్వహించిన వీడ్కోలు కార్యక్రమంలో చైర్మన్‌ గిరిధర్‌ రెడ్డి, ఎండీ కే.వేణుగోపాల్‌ రావు పాల్గొన్నారు. మోయిజ్‌ను ఘనంగా సన్మానించి మెమొంటో అందజేశారు. సెట్విన్‌ అకౌంట్స్‌ అధికారి సురేష్‌ బాబు, సూపరింటెండెంట్‌ రాధాకృష్ణ, ఉద్యోగులు నవీన్‌ కుమార్‌, చంద్రయ్య పాల్గొన్నారు.

ఉస్మానియా ఆసుపత్రి కాంట్రాక్ట్‌ ఉద్యోగుల జీతాల్లో కోతలు వద్దు

అఫ్జల్‌గంజ్‌: ఉస్మానియా ఆసుపత్రిలోని కాంట్రాక్ట్‌ ఉద్యోగుల జీతాల్లో కోతలు పెట్టొద్దని భారతీయ మాజ్దూర్‌ సంఘ్‌ కార్యనిర్వహక కార్యదర్శి శంకర్‌ అన్నారు. సోమవారం ఆయన ఆసుపత్రిలోని వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులతో సమావేశమయ్యారు. కార్మికులు తమ జీతాల్లో రెండు, మూడు వేల చొప్పున కోతలు విధిస్తున్నారని, సకాలంలో జీతాలు చెల్లించడం లేదని ఆయనకు తెలిపారు. ఉస్మానియా ఆసుపత్రిలో సుమారు 900 మంది కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడానికి కృషి చేస్తామని శంకర్‌ అన్నారు. ఈ కార్యక్రమంలో బీఎంఎస్‌ ఉస్మానియా యూనిట్‌ కార్యనిర్వహక అధ్యక్షుడు గొల్లపల్లి అనిల్‌కుమార్‌, నాయకులు మహేష్‌, జీపీ కృష్ణసాయి, శివ పాల్గొన్నారు.